## ఎన్నికలకు సహకరించాలి

■ అటంకం కలిగిస్తే చర్యలు ■ ఎస్పీ రూపేశ్



పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, నవంబర్ 29 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సహించమని, వారిపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఎస్పీ రూపేశ్ హెచ్చరించారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో ఈవీఎం, ఎన్నికల సిబ్బంది కేటాయింపులో పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. రానున్న 24 గంటల్లో పోలీసులు కీలకంగా వ్యవహరించాలన్నారు. డబ్బు, మద్యం రవాణాను అడ్డుకోవాలని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు విధి నిర్వహాతోపాటు ప్రజలకు ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఎస్పీ కోరారు.

## పోలింగ్‌కు భారీ బందోబస్తు



హద్నూర్ ఎస్సై రామనాయుడు

న్యాల్‌కల్, నవంబర్ 29 : మండలంలో గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని హద్నూర్ ఎస్సై రామనాయుడు తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. న్యాల్‌కల్ మండలంలోని 37 గ్రామ పంచాయతీపరిధిలో 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల సజావుగా జరిగేందుకు 110 పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాలైన మిర్జాపూర్(ఎన్), రేజింతల్, గుంజోట్టిలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడు రికార్డు చేస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రం పరిధిలోని 200 మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు సహకరించాలని ఎస్సై రామనాయుడు కోరారు.






సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్

# పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

■ జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
■ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ
■ జిల్లా గ్రీవెన్స్ కమిటీలో ఆధారాలతో బాధితులు నగదు పొందవచ్చు
■ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 29 : శాసనసభ ఎన్నికల పర్యవేక్షణ కోసం జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 30న పోలింగ్ సందర్భంగా అన్నిరకాల పూర్తిస్థాయి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఎన్నికల సమీకృత కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతి క్షణం అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. సెక్టోరల్ అధికారులు, ఈవీఎం వాహనాల జీపీఎస్ ట్రాకింగ్, మీడియా, మానిటరింగ్, వెబ్ క్యాస్టింగ్ మానిటరింగ్, సీ–విజిల్ మానిటరింగ్ చేస్తామని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్‌లో ఆయా పర్యవేక్షణకై పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అన్ని చర్యలు తీసుకుంటూ, అత్యంత సూక్ష్మస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతుంటుందని కలెక్టర్ శరత్ తెలిపారు. కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ, సిబ్బంది, ఆయా అంశాలు వివరిస్తూ, పనితీరును ఆరా తీసి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట డీఆర్వో నగేశ్ ఉన్నారు.

### రూ.3 .43 కోట్ల నగదు విడుదల

★ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి జిల్లాలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ ద్వారా సరైన ఆధారాలు సమర్పించినవారికి ఇప్పటివరకు రూ.3 కోట్ల 43 లక్షల 6 వేల 238 నగదు విడుదల చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఒక ప్రకటన జారీ చేశారు. ఎన్నికల షెడ్యూలు వెలువడిన రోజు నుంచి ఇప్పటి వరకు 173 కేసుల్లో రూ.5,27,42,852 నగదును సీజ్ చేశామని పేర్కొన్నారు. ఇందులో 160 కేసులకు సంబంధించి రూ.3 కోట్ల 43 లక్షల 6వేల 238 నగదు విడుదల చేశామన్నారు. మిగతా 13 కేసుల్లో సీజ్ చేసిన రూ.1,84,36,614 నగదుకు సంబంధించిన వ్యక్తులు సీజ్ చేసిన తమ నగదుకు సంబంధించి సరైన ఆధారాలు జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి డబ్బును విడుదల చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50వేల కంటే మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేస్తామన్నారు. సీజ్ చేసిన నగదుకు పూర్తి ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పిస్తే, కమిటీ పరిశీలించి సరైన ఆధారాలు ఉన్నట్లైతే నగదును ఇస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. నగదు సీజ్ చేస్తే పూర్తి ఆధారాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సంప్రదించాలన్నారు.



ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

# సమన్వయంతో పనిచేయాలి

■ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
■ జిలాల్లో 822 పోలింగ్ లొకేషన్లు
■ 1437 పీఎస్‌ల్లో 156 రూట్స్ మొబైల్స్
■ 2632 మంది పోలీసు సిబ్బంది
■ 2-ప్లటూన్ల, టీఎస్ఎస్‌పీ సిబ్బంది, 29 క్విక్ రియాక్షన్ టీమ్స్
■ పటిష్టంగా ఎన్నికల రూల్స్ అమలు
బ ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, నవంబర్ 29 : జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది ఇతర ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఎన్నికలను ప్రశాంతంగా జరిగేట్లు చర్యలు తీసుకోవాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. బుధవారం నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాలకు పోలీసులు, ఎన్నికల సిబ్బందిని కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో 822 పోలింగ్ లొకేషన్లు ఉన్నాయని, 1437 పోలీస్‌స్టేషన్లలో 156 రూట్స్ మొబైల్స్ ఉన్నాయన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి 2632 మంది సిబ్బందిని కేటాయించామని, 2–ప్లటూన్ల టీఎస్ఎస్‌పీ సిబ్బంది, 29 క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాటు చేసి భద్రతను పటిష్టం చేశామన్నారు. జిల్లాలో పటిష్టంగా ఎన్నికల నియమావళిని అమలు చేసి, ప్రజలకు ప్రశాంత వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. 6–స్ట్రయికింగ్ ఫోర్స్,4–స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్‌లతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసీవింగ్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికల విధులకు హాజరవుతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో విధులు నిర్వహిస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలతో సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లు, సిబ్బందికి అన్ని సౌకర్యాలు ఉండేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సరిచేసుకోవాలని ఎస్‌హెచ్‌వోలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో ఉండే సిబ్బంది సమస్య వస్తే వెంటనే రూట్ మొబైల్ టీమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్



పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రూపేశ్

### ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు...

ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు, మద్యం పంపిణీ చేసేవారికోసం జిల్లావ్యాప్తంగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు గాలిస్తున్నాయని ఎస్పీ తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుల వద్ద పట్టుబడ్డ నగదు

హత్నూర, నవంబర్ 29 : మండలంలోని దౌల్తాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల వద్ద రూ. 56,240 నగదు పట్టుబడినట్లు ఎస్సై సుభాష్ తెలిపారు. బుధవారం దౌల్తాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ నాయకులు హకీం, అంజద్ వద్ద నగదు పట్టుబడడంతో స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. పూర్తి విచారణ అనంతరం కేసు నమోదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657